

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   శనివారం 05-07-2025   సంపుటి : 07   సంచిక : 54   పేజీలు : 8   వెల : రూ 3-00


# జల్‌జీవన్ మిషన్‌కు అత్యంత ప్రాధాన్యం

**గత ప్రభుత్వం ఈ పథకాన్ని పట్టించుకోలేదు**
**ప్రకాశం జిల్లాల్లో 1290 కోట్లతో ప్రాజెక్ట్**
**మంచినీటి సమస్య తీర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ**
**వైకాపా బెదిరింపులకు భయపడేది లేదు**
**వారు మళ్లీ అధికారంలోకి రావడం కల్ల**
**ప్రకాశం జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**

ఒంగోలు,జూలై4 ( : గత జగన్ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను పట్టించుకోలేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. దీంతో గ్రామాలకు శుద్ధజలాలన్ని అందించే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకాశం జిల్లాని అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. వెలుగొండ ప్రాజెక్ట్ పనులని పూర్తిగా నిర్లక్ష్యంగా గాలికి వదిలి వేశారని విమర్శించారు. గత పాలకులు రౌడీయిజం, గుండాయిజంలను మాత్రమే నమ్ముకున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం ప్రకాశం జిల్లాలోని మార్కాపురం లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. మార్కాపురం మండలం నరసింహాపురం వద్ద రూ. 1290 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులకి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. తమ ప్రభుత్వం కక్ష తీర్చుకునేది కాదని... తప్పులు చేస్తే శిక్షించే ప్రభుత్వమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా తనకు ఎవరిపైనా కోపం లేదని చెప్పుకొచ్చారు. కుత్తుకలు కోస్తాం అనే వైసీపీ తాటాకు చప్పుళ్లకు భయపడమని అన్నారు. మళ్లీ అధికారంలోకి ఆ పార్టీ నేతలు ఎలా వస్తారో చూద్దామని చెప్పారు. వైసీపీకి 151 సీట్లు వచ్చి... తాను రెండు చోట్ల ఓడినప్పుడు కూడా వారిని ఎదిరించానని గుర్తుచేశారు. సినిమా డైలాగులు నిజజీవితంలో బాగుండవని చెప్పుకొచ్చారు. తలదించుకుని పనిచేస్తున్న వారిని రెచ్చగొట్టవద్దని హితవు పలికారు. సామాన్యులను బెదిరించడం వల్లే వైసీపీకి ఈ దుస్థితి వచ్చిందని పవన్ కల్యాణ్ విమర్శించారు. 'నేను ప్రభుత్వ ఉద్యోగి కొడుకును కాబట్టి ప్రకాశం,



నెల్లూరుతో సహా ఐదారు జిల్లాలోతిరిగాను. నెల్లూరులో నాకు ఇంటర్‌మీడియట్ సీట్ ఆనం వివేకానంద రెడ్డి ఇప్పించారు. ప్రకాశం జిల్లా అంటే గుర్తుకు వచ్చేది ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. సైమన్ కమిషన్‌కి ఎదురొడ్డి నిలిచిన ధైర్యవంతుడు ప్రకాశం పంతులు. ప్రకాశం జిల్లాలో అపారమైన ఖనిజాలు ఉన్నాయి. జగన్ హయాంలో అభివృద్ధిలో ఈ జిల్లాని పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేశారు. దశాబ్దాలుగా వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు. ఒంగోలులో రెండు సంవత్సరాలు, కనిగిరిలో ఆరు నెలలు మేము ఉన్నాం. కనిగిరిలో ఫ్లోరైడ్ సమస్యతో అక్కడి నుంచి మేము వెళ్లిపోయాం. జల్ జీవన్ పనులు మొదటి ప్రయారిటీ ప్రకాశం జిల్లాకి ఇచ్చామని అన్నారు. ప్రకాశం జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కావాలి. జల్ జీవన్ మిషన్ పథకాన్ని ఆపేస్తున్నామని కేంద్రం మాకు చెప్పింది. నీళ్లు ఇవ్వడం అన్నది రాష్ట్రానికి సంబంధించింది. కేంద్ర మంత్రి పాటిల్‌ను కలిసి అన్ని విషయాలు వివరించా. నీటి ఎద్దడి ప్రాంతాలకు రూ.84 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పాం. ప్రస్తుతం జల్ జీవన్ మిషన్ మొదటి విడత రూ.1,290 కోట్లతో శంకుస్థాపన చేసుకున్నాం. స్వాతంత్య్రం వచ్చాక తొలిసారిగా ప్రకాశం జిల్లాలో అతిపెద్ద తాగునీటి పథకమిదే.


# జులై 21 నుంచి ఆగస్ట్ 12 వరకు వర్షాకాల సమావేశాలు

న్యూఢిల్లీ,జులై4 జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఆగస్టు 21 వరకు నెల రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల షెడ్యూల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ఆగస్టు 15న స్వాతంత్య దిన వేడుకలు ఉన్నందున 13, 14 తేదీల్లో సమావేశాలు ఉండవని తెలిపారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రవాద దాడిపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఈ సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది. బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని



100 శాతానికి పెంచుతున్నట్లు తెలుస్తోంది. బిల్లు ముసాయిదా సిద్ధంగా ఉంది. పహల్గాం ఉగ్రదాడి, ఆ తరువాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్–పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కూడా ఈ సందర్భంగా చర్చించాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో వర్షాకాలపు సమావేశాలు వాడి వేడిగా జరిగే అవకాశముంది. గతలో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు రెండు భాగాలుగా జరిగాయి. మొదటి సమావేశం జనవరి 31న ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకూ కొనసాగింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాల రెండవ భాగం మార్చి 10న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగిసింది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ ఫోకస్



హైదరాబాద్: జులై4 )జూబ్లీహిల్స్ ఎన్నికపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఉప ఎన్నికలో మూడు పార్టీలు కలిసి బరిలోకి దిగుతాయని చెప్పుకొచ్చారు. ఉప ఎన్నికను సమర్థవం తంగా ఎదుర్కొవాలని దిశానిర్దేశం చేశారు. గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జి మంత్రులు ప్రతి అంశాన్నీ సీరియస్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ పదవులు వెంటనే భర్తీ చేయాలన్నారు. పార్టీ కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని హుకుం జారీ చేశారు. పార్టీ పదవులు భర్తీ చేయడంలో టీపీసీసీ చీఫ్ ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. లోకల్ బాడీ ఎన్నికల్లో నేషనల్ నరేటివ్ బిల్డప్ చేసుకోవాలని సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కేంద్రప్రభుత్వం మెడలు వంచి జనగణనలో కులగణన చేసేలా చేయడంలో మనం విజయం సాధించామని వ్యాఖ్యానించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో మనం చాలా విజయాలు సాధించామని చెప్పుకొచ్చారు. తాను టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 45 లక్షల మందితో క్రియాశీలక సభ్యత్వం చేయించానని గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్, ఔజఎ, పార్టీ జిల్లా అధ్యక్షుల్లో చాలా మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు వరించాయని స్పష్టం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.




హైదరాబాద్:జులై4 టీపీసీసీ తలపెట్టిన సామాజిక న్యాయ సమరభేరి సభ ప్రారంభమైంది. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,500 మందికిగా పైగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, అన్ని జిల్లాల, మండల కమిటీల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. సుమారు సుమారు 40 వేల మంది పైగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ సభకు తరలివచ్చారు. కాగా, జై బాపూ– జై భీమ్– జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా దీన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా మంత్రులు హాజరయ్యారు. ఈ సభలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీల అధ్యక్షులకు భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తున్నారు

# కేంద్రం సంచలన నిర్ణయం..

## అలాంటి కంటెంట్ చేస్తే జైలుకే..

న్యూఢిల్లీ,జులై4 ):'తల్లి పాలు తాగి రొమ్ము గుద్దే' వారు దేశంలో ఎక్కువై పోయారు. ఈ దేశంలో ఉ ంటూ.. ఈ దేశం తిండి తింటూ.. ఇక్కడ సౌకర్యాలు అనుభవిస్తూ.. పక్క దేశాలకు సపోర్టు చేస్తున్న వారు చాలా మందే ఉన్నారు. సోషల్ మీడియాలో సొంత దేశానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అలాంటి వారికి బుద్ధి చెప్పడానికి సిద్ధమైంది. కేంద్ర హోం శాఖ కొత్త పాలసీ తేబోతోంది. ఈ పాలసీ గనుక అమలైతే దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టే వారికి చుక్కలు కనిపించనున్నాయి.ఈ పాలసీలో భాగంగా దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెట్టే వీడియో, ఇతర కంటెంట్‌ను గుర్తించనున్నారు. వాటిని బ్లాక్ చేయనున్నారు. ఆ కంటెంట్ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. దేశానికి వ్యతిరేకంగా కంటెంట్ ఉండే వెబ్ సైట్లపై కూడా చర్యలు ఉండనున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలోని అత్యున్నతాధికారులు యాంటీ నేషనల్ పోస్టుల గురించి హోమ్ మినిస్ట్రీకి చెప్పారట. ఈ నేపథ్యంలోనే కేంద్ర కొత్త పాలసీ తేవాలని చూస్తోందట.



# సీఎం అభ్యర్థిగా హీరో విజయ్ పేరు ప్రకటించిన టీవీకే పార్టీ

చెన్నై,జులై4 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తమిళగ వెట్రి కగళం(టీవీకే) పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా టీవీకే అధినేత, హీరో విజయ్ పేరును ప్రకటించింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగానే బరిలో దిగుతుందని స్పష్టం చేసింది. బీజేపీ, డీఎంకేలతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. టీవీకే పార్టీ సిద్ధాంతానికి ఈ రెండు పార్టీలు శత్రువులని పేర్కొంది.పార్టీ అధినేత విజయ్ అధ్యక్షతన శుక్రవారం చెన్నైలో ఉన్నత స్థాయికమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా పార్టీ పలు తీర్మానాలుచేసింది. సెప్టెంబర్,డిసెంబర్ మాసాల మధ్య విజయ్ పర్యటన రాష్ట్రంలో కొనసాగుతుందని ప్రకటించింది. వచ్చే నెలలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. అలాగే గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా నేతలకు సూచించింది ఉన్నతస్థాయి కమిటీ.ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇంగ్లీష్ భాషపై చేసిన వ్యాఖ్యలపై సైతం ఈ సందర్భంగా చర్చించారు. అలాగే తమిళనాడులో ద్వంద్వ భాషా విధానాన్ని అమలు చేసేందుకు కేంద్రం



చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని స్పష్టం చేసింది టీవీకే. తమిళనాడుపై హిందీ, సంస్కృతం భాషను బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తే.. ఆ చర్యలను తమ పార్టీ అడ్డుకుంటుందని విజయ్ వెల్లడించారు.అయితే ఎన్నికల సవరణ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టారు విజయ్. మైనార్టీ ఓట్లను తగ్గించేందుకే ఈ నిర్ణయమని పేర్కొన్నారు. అంతేకాదు.. బీజేపీ అనుకూల ఓట్లను పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో ఇది ఒక భాగమన్నారు. కాగా, 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలు సభలు, సమావేశాలు నిర్వహించడమే కాకుండా.. కీలక నిర్ణయాలను హీరో విజయ్ తీసుకునే అవకాశముందని సమాచారం


# సంపాదకీయం

శనివారం 05-07-2025

## సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించాలా..?

భారత దేశం అంటేనే లౌకిక దేశంగా పేరు. ఇపుడా లౌకిక అనే పదాన్నే తీసెయ్యాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయ్. అలాగని ఇది అందరి నుంచీ కాదు.. ఒక సెక్షన్ నుంచి మాత్రమే ఈ తరహా డిమాండ్ వినవస్తోంది. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించాలి దత్తాత్రేయ హ్సబెలే. రాజ్యాంగ పీఠికలోని సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించాలని ఖీూా నేత చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఎమర్జెన్సీ సమయంలో ఈ పదాలను కాంగ్రెస్ బలవంతంగా చేర్చిందని, దీనిపై చర్చ జరగాలని దత్తాత్రేయ హ్సబెలే చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, ఆరెస్సెస్ మాస్క్ తొలిగిపోయిందని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ, ఆరెస్సెస్.. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని చూస్తున్నాయని.. రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. ఇందుకు కొనసాగింపుగా ఉపరాష్ట్రపతి ధన్కర్ సైతం ఇదే వాయిస్ వినిపించారు. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, లౌకిక అనే పదాలను జోడించడం సనాతన స్ఫూర్తికి విరుద్ధమని అన్నారాయన. 1975లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితి దేశ రాజ్యాంగానికే చీకటి కాలమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. సోషలిస్ట్, సెక్యులరిస్ట్ పదాలు ప్రవేశికలో ఉండాలా వద్దా? అనే దానిపై చర్చ జరగాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబెలే చెప్పిన రెండు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ వ్యాఖ్యలు చేయడంతో ఇదో చర్చనీయాంశమైంది. దిగారు. అంతే కాకుండా సనాతన ధర్మానికి విరుద్ధం అన్న కామెంట్లు సైతం చేశారు. సరిగ్గా ఇదే సమయంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సైతం ఇదే అంశంపై కామెంట్ చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రి అయిన శివరాజ్ సింగ్.. భారతదేశంలో సోషలిజం అవసరం లేదని అన్నారు. లౌకిక వాదం మన సంప్రదాయం కాదని అన్నారు. ఎమర్జెన్సీలో వీటిని చేర్చారనీ.. ఇది అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలో భాగం కానే కాదని అన్నారాయన. భారత్ మే సమాజ్ వాద్ కీ జరూరత్ నహీ హై, ధర్మ నిరపేక్ష్ హమార సంస్కృతి కా మూల్ నహి హై.. ఔర్ ఇస్లీయే పర్ జరూర్ విచార్ హోనా చాహియే.. అన్నారు. దీనర్థమేంటంటే.. భారతదేశంలో ఈ రకమైన పదాలు మనకు అవసరం లేదని అన్నారు చౌహాన్. కాబట్టి, దీనిపై చర్చించాలి అన్నది ఈ వ్యాఖ్యల సారాంశం. ఒకరకంగా చెబితే.. ఇది ఆర్ఎస్ఎస్ పిలుపునకు పరోక్ష మద్దతుగా భావిస్తున్నారు. లౌకిక వాదం మనది కాదన్న అస్సాం సీఎం హిమంత. ఇక ఇదే అంశంపై మరొక నేత కూడా కామెంట్ చేశారు. ఆయనే.. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ. సోషలిజం, లౌకికవాదం మనవి కావు. పాశ్చాత్య భావనలని, ఈ పదాలకు భారత నాగరికతలో స్థానం లేదని అన్నారు. మీరు కాస్త గట్టిగా ఆలోచిస్తే మన అస్తిత్వ సవాళ్లకే మనం అవకాశమిస్తున్నామని.. ఇదొక చీడ పురుగుగా దేశాన్ని పట్టి పీడిస్తోందని అన్నారు ఉప రాష్ట్రపతి. ఇది వేల సంవత్సరాల నాగరికతను కించ పరుస్తోందని.. ఈ సెక్యులరిజం అన్నది మనదైన సంప్రదాయాన్ని తక్కువ చేసుకోవడం తప్ప మరొకటి కాదని అన్నారు ధన్కర్. ఇది సనాతన ధర్మానికే పూర్తి అవమానకమని కామెంట్ చేశారు ధన్కర్. ఉపరాష్ట్రపతి ధన్కర్ కి రచయిత, మాజీ కర్ణాటక ఎమ్మెల్సీ వీరయ్య రాసిన సంకలనం అంబేద్కర్ సందేశాలు అనే పుస్తకం తొలి కాపీ అందించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ జగదీప్ ధన్కర్ ఈ కామెంట్లు చేశారు. ఆర్ఎస్ఎస్ అగ్ర నేత నుంచి ఉపరాష్ట్రపతి వరకూ ఈ తరహా కామెంట్లు చేయడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోంది కాంగ్రెస్. తర్వాత మురుగన్ మానాడు సభలోనూ పవన్ సరిగ్గా ఇలాంటి సెక్యులరిస్టు కామెంట్లు చేశారు. ఇది గత కొంతకాలంగా భారతదేశంలో వినిపిస్తున్న మాట. ఆ మాటకొస్తే మొన్న పూనేకి చెందిన లా స్టూడెంట్ శర్మిష్ట పనోలీ విషయంలోనూ సరిగ్గా ఇలాగే కామెంట్ చేశారు పవన్. దేశంలో సెక్యులరిజం అంటే అది హిందుత్వ వాదులను అనడానికి మాత్రమే పనికొచ్చే ఒకానొక వెసలుబాటు కాదని కామెంట్ చేశారాయన. ఈ ధోరణి వెనక రాజ్యాంగంలోని ఈ సెక్యులరిస్ట్ పదాలే కారణమన్నది వీరందరి వాదనగా తెలుస్తోంది. 1976లో అత్యవసర పరిస్థితి సమయంలో 42వ రాజ్యాంగ సవరణలో భాగంగా లౌకిక, సోషలిస్ట్ అనే రెండు పదాలను ప్రవేశికలో చేర్చారు. అత్యవసర పరిస్థితి తర్వాత అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం 42వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేసిన అనేక ఇతర మార్పులను తిప్పికొట్టినప్పటికీ, అది సోషలిస్ట్, సెక్యులరిస్ట్ అనే పదాలను అలాగే ఉంచింది. వాస్తవానికి, 2014లో నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, నాటి బిజెపి అధ్యక్షుడు అమిత్ షా 2015లో పార్టీ లైన్‌ను స్పష్టం చేశారు. నేటి పీఠిక అలాగే ఉండాలని బిజెపి విశ్వసిస్తుంది. దానిని మార్చాల్సిన అవసరం లేదని అన్నారు. బేసిగ్గా చూస్తే ఇప్పటి వరకూ భారత్ కి రక్షణ కవచం ఈ లౌకిక వాదమే. పాకిస్థాన్ లా ఒక మత తత్వ దేశంగా భారత్ మారితే.. దాని విస్తృత రూపం రేపటి రోజున మరొక విధంగా మారే అవకాశం లేక పోలేదు. కానీ బీజేపీ చూస్తుంటే భారత్ ని లౌకిక వాదం నుంచి పక్కకు తప్పించేందుకు తీవ్ర యత్నాలు చేస్తున్నట్టే కనిపిస్తోందని అంటారు రాజ్యాంగ నిపుణులు. ఏం పాకిస్థాన్ మన నుంచి విడిపోయి ఇస్లామిక్ కంట్రీగా మారినపుడు మన దేశం హిందూ దేశం ఎందుకు కాకూడదన్నది రెగ్యులర్ గా సంఘ్ పరివార్ సభ్యులు వేసే ప్రశ్న. వీరి ఆలోచన ప్రకారం భారత దేశం ఇప్పటి వరకూ లౌకిక వాదం, సామ్యవాదం ద్వారా నష్టపోయినట్టుగానే చెప్పాల్సి ఉంటుంది. సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగిస్తే ఏం జరుగుతుంది? ఒక వేళ సోషలిస్ట్, సెక్యులర్ అనే పదాలు తొలిగిస్తే ఏం జరుగుతుంది? అని చూస్తే అది దేశ స్వరూప స్వభావాలను పూర్తిగా మార్చే అవకాశం కనిపిస్తోంది.

# కాంగ్రెస్ కంటే కడియంపైనే ఎక్కువ వ్యతిరేకత ఉంది.. టి.రాజయ్య ఎద్దేవా



వేలేరు, జూలై :స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కంటే ఎమ్మెల్యే కడియం శ్రీహరిపైనే ఎక్కువ వ్యతిరేకత ఉందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి. రాజయ్య విమర్శించారు. శుక్రవారం వేలేరు మండలం సోడాషపల్లిలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. సొంత పార్టీ నాయకులే కడియం శ్రీహరిపై మండిపడుతున్నారని తెలిపారు. అటు సొంత పార్టీలో, ఇటు ప్రతిపక్ష పార్టీలో వ్యతిరేకతను మూటగట్టుకున్న కడియం శ్రీహరి చచ్చిన పాములా తోక ఊపుతున్నాడని అన్నారు. చచ్చిన పాము తోకను కొండా మురళి ఇంకా చంపుతున్నాడని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తలలు పట్టుకుంటుందని అన్నారు. అప్పుల కోసం వెళ్తే చెప్పుల దొంగను చూసినట్లు చూస్తున్నారని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. సుద్ద దద్దమ్మలే ఇలాంటి మాటలు మాట్లాడతారని ఎద్దేవా చేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు టి.రాజయ్య సూచించారు. పల్లెల్లో కార్యకర్తలు బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని తెలిపారు. గ్రామాలలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని స్పష్టం చేశారు.

# ఆపరేషన్ సింధూర్ వేళ.. ఆయుధాలు పరీక్షించిన చైనా: ఆర్మీ డిప్యూటీ చీఫ్ రాహుల్ సింగ్



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను పేల్చేందుకు భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో అనేక అవరోధాలు ఎదురయ్యాయి. ఆ ఆపరేషన్ ఎన్నో పాఠాలు నేర్పినట్లు డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ తెలిపారు. ఎఫ్ఐసీసీఐ నిర్వహించిన న్యూ ఏజ్ మిలిటరీ టెక్నాలజీస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆధునిక యుద్ధ శైలి గురించి ఆపరేషన్ సిందూర్ బయటపెట్టిందన్నారు. సైనిక చర్యల వేళ .. వాయు రక్షణ వ్యవస్థ, సాంకేతిక ఆధునీకరణ.. కీలకమైన అంశాలని ఆయన తెలిపారు.పాకిస్థాన్–చైనా మధ్య కూటమి ప్రమాదకరంగా మారినట్లు ఆర్మీ డిప్యూటీ చీఫ్ వెల్లడించారు. పాకిస్థాన్‌తో బోర్డర్ విషయంలో రెండు సమస్యలు ఉన్నట్లు ఆయన చెప్పారు. పాకిస్థాన్ ముందు ఉండగా, దాని వెనుక చైనా ఆ దేశానికి సపోర్టు ఇస్తున్నట్లు చెప్పారు. పాకిస్థాన్ వద్ద ఉన్న మిలిటరీ దళంలో .. సుమారు 81 శాతం చైనా హార్డ్‌వేర్ ఆయుధాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో ఎయిర్ డిఫెన్స్ కీలకంగా మారిందని, ఆ ఆపరేషన్ కొన్ని పాఠాలు నేర్పిందన్నారు. భారతీయ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను చాలా బలోపేతం చేయాల్సి ఉందన్నారు. చైనా సహాయంతో పాకిస్థాన్ మన గురించి లైవ్ అప్‌డేట్స్ తెలుసుకున్నదని, మన ఆయుధాల అంశాన్ని పాకిస్థాన్‌కు ఎప్పటికప్పుడు చేరవేసిందన్నారు.ఇతర ఆయుధాలతో పోటీపడేందుకు చైనా తన ఆయుధాలను టెస్ట్ చేసిందని, ఇదొకరకంగా లైవ్ ల్యాబ్‌లా మారిందని, టర్కీ కూడా పాకిస్థాన్‌కు కీలకమైన సపోర్టు ఇచ్చిందని, బైరక్తార్‌తో పాటు ఎన్నో రకాల డ్రోన్లను అందజేసిందన్నారు. డీజీఎం స్థాయి చర్చలు జరుగుతున్నప్పుడు మన ఆయుధాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పాకిస్థాన్‌కు చైనా చేరవేసిందన్నారు. ఈ దశలో మనకు బలమైన వాయు రక్షణ వ్యవస్థ కావాలని లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ తెలిపారు. కానీ ఆపరేషన్ సింధూర్ వేళ భారతీయ సైనిక బలగాలు చాలా కచ్చితత్వంతో ఉగ్ర స్థావరాలపై దాడులు చేశాయన్నారు. మానవ మేధస్సు, టెక్నాలజీ మధ్య వ్యూహాత్మక సహకారం ఉండాలన్నారు.ఆపరేషన్ సింధూర్ కోసం 21 టార్గెట్లను గుర్తించామని, దీంట్లో 9 టార్గెట్లను ఎంచుకున్నామని, ఆపరేషన్ జరిపే చివరి రోజు మాత్రమే ఆ 9 టార్గెట్లను ధ్రువీకరించామని పేర్కొన్నారు. త్రివిధ దళాలు ఐక్యంగా ఆపరేషన్‌లో పాల్గొన్నాయని తెలిపారు. సైనిక లక్ష్యం చేరుకున్న తర్వాత.. దాన్ని ఆపాల్సి ఉంటుందని, యుద్ధం ప్రారంభించడం చాలా సులువు అని, కానీ దాన్ని నియంత్రించడం కష్టమైందన్నారు. సరైన సమయంలో యుద్ధాన్ని ఆపి మాస్టర్ స్ట్రోక్ ఇచ్చామని పేర్కొన్నారు.

# దుద్దెనపల్లిలో ప్రైవేట్ స్కూల్ బస్సులను అడ్డుకున్న గ్రామస్తులు

## గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కాపాడుకునేందుకు ఆందోళన

కరీంనగర్ జూలై 4, కరీంనగర్ జిల్లాలో ప్రైవేట్ స్కూళ్ళకు వ్యతిరేకంగా గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మహిళలు ప్రైవేట్ స్కూల్ బస్సులను అడ్డుకుని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల కాపాడుకునేందుకు నడుంబిగించారు. సైదాపూర్ మండలం దుద్దెనపల్లి లో ప్రైవేట్ స్కూళ్ళ దాటికి ప్రభుత్వ పాఠశాల మూతపడే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ హై స్కూల్ లో 6 నుంచి పది తరగతులకు 8 మంది క్వాలిఫైడ్ టీచర్లు ఉండగా విద్యార్థులు మాత్రం 24 మంది మాత్రమే ఉన్నారు. సకల సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలను కాదని దుద్దెనపల్లికి చెందిన సుమారు వందమంది పిల్లలు హుజురాబాద్ లోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. పోటీపడి ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులను తీసుకెళ్ళుతుండడంతో గ్రామంలోని సర్కారు బడి మూతపడే పరిస్థితి ఉందని గ్రామస్తులు మహిళా సంఘాలు ఏకమై ప్రైవేట్ స్కూల్ బస్సులను వ్యాన్లను అడ్డుకున్నారు. మా గ్రామంలోకి ప్రైవేటు స్కూలు వాహనాలు రావద్దని హుకుం జారీచేసింది. గ్రామస్తులు మహిళ సంఘాల ప్రతినిధులు ప్రైవేటు స్కూలు వాహనాలను అడ్డుకోవడంతో ప్రైవేట్ స్కూళ్లకి వెళ్లే విద్యార్థులు కొందరు వ్యతిరేకిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాత్రం ప్రైవేటు వద్దు ప్రభుత్వం పాఠశాల ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ప్రైవేట్ పాఠశాలల వాహనాలు గ్రామంలోకి రానివ్వమని స్పష్టం చేశారు. సకల సౌకర్యాలు ఉన్న సర్కార్ బడిని కాదని కూలి పని చేస్తూ వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన చదువు చెబుతున్నారని అందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

# మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి

సిద్దిపేట జూలై 4, ) సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్. ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య సుదీర్ఘ కాలంగా ప్రజాసేవలో నిమగ్నమై, చేసిన దేశసేవ, పరిపాలన పటిమ, నిష్కలంకమైన రాజకీయ జీవితాన్ని గడిపారని కొనియాడారు. రాజకీయాల్లో ఉన్నతమైన నైతిక విలువలకు కాపాడుకుంటూ ఆయన సేవా తత్వంతో ప్రజలల్లో మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వంలో 16 సార్లు ఆర్థిక శాఖ మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టి అరుదైన ఘనత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, సూపరిండెంట్లు వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొని పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు.

# భూ చట్టాలపై అవగాహనకు న్యాయ యాత్ర : భూమి సునీల్



నల్లగొండ సిటీ, జులై 04 : భూ సమస్యల పరిష్కారం, చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ యాత్ర చేపడుతున్నట్లు భూమి చట్టాల నిపుణుడు, రైతు కమిషన్ సభ్యుడు భూమి సునీల్ తెలిపారు. లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాత్రలో భాగంగా శుక్రవారం కనగల్ మండల కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతు వేదిక, తాసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యాక్రమానికి రైతులు హజరై తమ భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. రైతుల కోసం 120 భూ చట్టాలు, 50 వ్యవసాయ చట్టాలు ఉన్నట్లు తెలిపారు. వాటిపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇతర దేశాల్లో రైతులు చట్టాలను వినియోగించి న్యాయస్థానాల ద్వారా నష్ట పరిహారం పొందుతారని తెలిపారు. మన దగ్గర కూడా రైతులు తమ హక్కుల కోసం చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులు తెలిపిన పలు సమస్యలకు న్యాయపరంగా ఎలా పొందాలో వివరించే కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ పద్మ పాల్గొన్నారు.


# పెట్రోల్ బంక్‌లో భారీ పేలుడు..

## 20 మందికిపైగా గాయాలు



ఇటలీలోని రోమ్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. ఓ పెట్రోల్ బంకులో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో సుమారు 20 మందికిపైగా గాయపడ్డారు. ఇటాలియన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రెనెస్టినో ప్రాంతంలోని ఎల్‌పీజీ పెట్రోల్ పంపు వద్ద ఈ ఘటన జరిగింది. పేలుడు శబ్దం రాజధాని అంతటా వినిపించింది. ఈ ఘటనలో 16 మంది పౌరులు, ఎనిమిది మంది పోలీసులు, ఫైర్ సిబ్బంది ఒకరు గాయపడ్డారు. వెంటనే స్పందించిన అధికారులు అక్కడ సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడి వారిలో ఎవరూ ప్రాణాపాయ స్థితిలో లేరని అధికారులు తెలిపారు. మరోవైపు అక్కడ ఇంకా మంటలు అదుపులోకి రాలేదని స్థానిక అధికారులను ఊటంకిస్తూ స్థానిక మీడియా వెల్లడించింది.

# బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల చేతులు కట్టేసి.. ప్రత్యేక విమానంలో ఢాకా తరలింపు



అహ్మదాబాద్: సుమారు 250 మంది బంగ్లాదేశ్ అక్రమ వలసదారులను గుజరాత్ పోలీసులు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. తాళ్లతో వారి చేతులు కట్టేసి ప్రత్యేక విమానంలో ఢాకా తరలించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్, వడోదర, రాజ్‌కోట్‌తో పాటు పలు నగరాల్లో బంగ్లాదేశ్ జాతీయులు వేల సంఖ్యలో అక్రమంగా నివసిస్తున్నారు. వీరిని గుర్తించడానికి గత కొన్ని రోజులుగా స్థానిక పోలీసులతో కలిసి అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వందలాది మంది బంగ్లాదేశ్ జాతీయులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిలో చాలా మంది నకిలీ ఆధార్, పాన్ కార్డులు కలిగి ఉన్నట్లు తెలుసుకున్నారు.కాగా, జూలై 3న సుమారు 250 మంది బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల చేతులను తాళ్లతో కట్టేశారు. గట్టి భద్రత మధ్య వడోదర ఎయిర్‌ఫోర్స్ బేస్‌కు వారిని తీసుకెళ్లారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢాకా తరలించారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల చేతులను తాళ్లతో కట్టి విమానం ఎక్కించిన వైరల్ అయ్యాయి. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయుల చేతులు, కాళ్లు కట్టేసి ప్రత్యేక విమానాల్లో భారత్‌కు పంపిన సంఘటనను ఇది గుర్తుచేసింది.

# మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణ

సికింద్రాబాద్,ఉజ్జయిని మహంకాళి అమ్మవారి కి మొదటి బోనాన్ని అత్తిలి కుటుంబం నుండి సమర్పించారు.. అమ్మవారి బోనాల జాతరను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మొదటి బోనం అత్తిలి కుటుంబం నుండి సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.. అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాంగోపాల్ పేట్ నుండి ఆలయం వరకు తొలి బోనం ను జోగిని శ్యామల తీసుకొచ్చారు.. సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బోనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు... డబ్బు సందేళ్ల మధ్య బోనం సమర్పణ కొనసాగింది.. జోగిని శ్యామల బోనంతో అమ్మవారిని స్మరించుకుంటూ నృత్యాలు చేస్తూ భక్తి పరవశంతో ఆలయానికి చేరుకున్నారు.

# మొహరం ను ప్రశాంతంగా జరుపుకోండి. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.




విభారే న్యూస్ జూలై 04 విభారే న్యూస్..శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు.అందరూ సోదరభావంతో మెలగాలి.మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ శుక్రవారం జిల్లా ప్రజలకు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించి గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. గ్రామ పెద్దలు, చిన్న, పెద్ద తేడా లేకుండా ఉత్తేజభరితంగా జరుపుకునే ఈ వేడుకలలో అల్లర్లకు తావుండరాదన్నారు.అందరూ సోదరభావంతో మెలగాలని సూచించారు.చిన్న సరిగెత్తి, పెద్ద సరిగెత్తి మరియు జలధి కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ముగిసే విధంగా సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.చట్ట విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మొహరం వేడుకలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు.

# అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి ఘన నివాళులు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా.



విభారే న్యూస్ జూలై 04 కర్నూలు జిల్లా ప్రతినిధి...మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సంధర్బంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటం చేసి ప్రాణాలర్పించిన యోధుడు,బ్రిటీష్ వారితో పోరాటాలు చేసిన అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ,ఎ ఆర్ డిఎస్పీ భాస్కర్ రావు, కమాండ్ కంట్రోల్ సిఐ శివశంకర్, ఆర్ ఐలు జావేద్, నారాయణ, సోమశేఖర్ నాయక్, ఆర్ ఎస్సైలు,స్పెషల్ పార్టీ సిబ్బంది,ఎఆర్ పోలీసులు ఉన్నారు.


# ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా సూర్య నారాయణ స్వామికి విశేష పూజలు...



విభారే న్యూస్ జూలై 04 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీ సూర్య నారాయణ స్వామి వారి దేవస్థానం నందు ××06/07/2025 ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ సూర్య నారాయణ స్వామి ఉత్సవ మూర్తులకు భక్తుల స్వహస్తములచే (108) అష్టోత్తర శత కలశముల తో అభిషేకం నిర్వహించబడును. ఉత్తరాయణ పుణ్యకాలం నందు చివరి ఏకాదశి ఈ రోజున శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని ఆరాధించడం వలన విశేష ఫలితం లభించును.కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వామి వారి అనుగ్రహాన్ని పొందగలరు (108) భక్తులకు మాత్రమే ఈ అవకాశం ఉదయం 9:00 గం?? ప్రారంభం అవుతుంది ×అభిషేక రుసుము - 516/- సంప్రదించవలసిన నెంబర్:- 9000400431 -9866800220దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు..889612 3777.ఆఫీసు ల్యాండ్ ఫోన్ నెంబర్...08518-234388.

# అన్నప్రసాద వితరణకి విరాళము

శ్రీశైలం జులై 4 )శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి శుక్రవారం నాడు విరాళం 1,11,000 లను శ్రీ సిమ్ మనీషానుహాల్ నాగపూర్ వాస్తవ్యులు అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి



# ఆన్లైన్ ద్వారాఉచిత సర్వదర్శనం టికెట్లు

సామాన్య భక్తుల సౌకర్యార్థం జూలై 1న తిరిగి ప్రారంభమైన ఉచిత సర్వదర్శనం
ఉచిత సర్వదర్శనానికి భక్తుల నుంచి అనూహ్య స్పందన
ఉచిత సర్వదర్శనం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు
ఉచిత సర్వదర్శనాలలో భక్తులు అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు ఆన్లైన్లో టోకెన్ల జారీ..

శ్రీశైలం ఈవో విభారే.. శ్రీశైలం ప్రతినిధి. జులై 4జూలై 1వ తేదీ నుంచి ప్రారంభించబడిన శ్రీస్వామివార్ల ఉచిత స్పర్శదర్శనానికి భక్తులనుంచి అనూహ్య స్పందన లభించిదని కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉచిత స్పర్శదర్శనం పున: ప్రారంభించిన రోజున తాను పలువురు భక్తులతో ముఖాముఖిగా సంభాషించి, వారి అభిప్రాయాలను అడగడం జరిగిందన్నారు. భక్తులందరు కూడా ఉచిత స్పర్శదర్శనం ప్రారంభం పట్ల ఎంతో సంతృప్తివ్యక్తం చేశారన్నారు. గతంలో వలనే వారంలో నాలుగురోజులపాటు అనగా మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఈ ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పించడం జరుగుతుందన్నారు.ఉచిత స్పర్శదర్శన సదుపాయ ఏర్పాట్లకు సంబంధించి శుక్రవారం కార్యనిర్వహణాధికారివారు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అన్ని విభాగాల యూనిట్ అధికారులు మరియు పర్యవేక్షకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ సామాన్య భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచడంలో భాగంగానే ఈ ఉచిత స్పర్శదర్శనం పున: ప్రారంభించడం జరిగిందన్నారు. శ్రీమల్లికార్జునస్వామివారిని భక్తులు స్వయంగా స్పర్శించడం వలన ఎంతో ఆధ్యాత్మికానుభూతిని పొందుతారన్నారు.అందుకే ఈ ఉచిత స్పర్శదర్శన నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. ఏ ఒక్క భక్తుడు కూడా ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండాలన్నారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవలసిన బాధ్యత దేవస్థానంపై ఉందన్నారు.ఈ కారణంగా ఈ ఉచిత స్పర్శదర్శన విధివిధానాల గురించి సమావేశంలో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది.ఉచిత స్పర్శదర్శనం పొందగోరే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు ఉచిత స్పర్శదర్శన టోకెన్లను ఆన్లైన్లో అందుబాటులో ఉంచాలని నిర్ణయించడం జరిగింది. ప్రస్తుతం స్పర్శదర్శనం టికెట్లు మరియు ఆయా ఆర్జితసేవాటికెట్లను పొందినట్లుగాళి6:34 ఖఓ, 7/4/2025ి ఃష్ట్రబీజూజీశ్రీ ఔవలిబ: స్పర్శదర్శనానికి సంబంధించి రోజుకు 1000 టోకన్లు మాత్రమే అందుబాటులో . : లిలిలి.బతీతిబజీతిశ్రీజీటవలజీబబిష్ట్రజీనిజీఎ.నీతీణ 5 లిలిలి. జీజూబివఎజూశ్రీవబ.జీజూ.ఐనీల.తిని ఈ ఉచిత టోకన్లు పొందవచ్చు. ప్రస్తుతం పరోక్ష సేవ విధానానికి అమలులో ఉన్నట్లుగానే ఈ ఉచితటోకన్లు కూడా భక్తులు ఒక్కరోజు ముందుగా ఆన్లైన్ ద్వారా పొందవలసివుంటుంది. అనగా మంగళవారం మధ్యాహ్నం స్పర్శదర్శనం చేసుకోవలసిన భక్తులు సోమవారం నాడే నిర్దిష్ట సమయంలోగా ఈ టోకన్లు ఆన్లైన్ నందు పొందవలసివుంటుంది.ఆన్లైన్ లో టోకన్లు పొందే సమయంలో భక్తుల పేరు, చిరునామా, ఆధార్నెం మరియు ఫోను నెంబర్లను విధిగా నమోదు చేయవలసి వుంటుంది.భక్తులు ఆన్లైన్ ద్వారా పొందిన టికెట్లను స్కానింగ్ చేయడం ద్వారా మరియు ఆధార్ గుర్తింపుతో పోల్చిన తదుపరే భక్తులను దర్శనానికి అనుమతించడం జరుగుతుంది. ఉచిత స్పర్శదర్శనం విధానంలో పారదర్శకత మరియు జవాబుదారీతనం కోసం ఈ ఆన్లైన్ టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరుగుతోంది.కాగా మధ్యాహ్నవేళల తరువాత ఆలయశుద్ధి, మంగళవాయిద్యాలు, సుసాంధ్యము, ప్రదోషకాల పూజలను నిర్వహించవలసి వున్నం దున మధ్యాహ్నం గం. 1.45ల నుంచి ఈ ఉచిత స్పర్శదర్శనం కల్పించబడుతోంది.కాగా ఎవరైనా ఈ ఉచిత ఆన్లైన్ టోకెన్ విధానాన్ని దుర్వినియోగం చేసినట్లయితే చట్టప్రకారం తగు చర్యలు చేపట్టబడుతాయి.కావున భక్తులందరు కూడా తగువిధంగా ఆన్లైన్ ద్వారా టోకెన్లను పొంది, స్వామివారి ఉచిత స్పర్శదర్శనాన్ని పొందవలసినదిగా కోరుతున్నాము

# నిరుపేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్లు

అన్న క్యాంటీన్లలో మెరుగైన నిర్వహణ ఉండాలి
నాణ్యమైన రుచికరమైన ఆహారం అందజేయాలి
జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





విభారే న్యూస్ నంద్యాల, , జూలై 4: తక్కువ ధరతో నిరుపేదల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు.శుక్రవారం నంద్యాల జిల్లా ఆసుపత్రి వద్ద ఉన్న అన్నాక్యాంటీన్ ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి ఆహారం ఏ సమయానికి వస్తుంది, ఎంతమందికి వస్తుంది, పారిశుధ్య సిబ్బంది ఎంతమంది ఉన్నారని వివరాలను ఆరా తీశారు. ఆహారం సరిపడా వస్తోందా ఏమైనా తక్కువ వస్తుందా అన్న వివరాలను కూడా తెలుసుకున్నారు. అలాగే అక్కడ భోజనం చేస్తున్న వారితో ఏ పని మీద వచ్చారు, ఆహారం రుచికరంగా ఉందా, బాగుందా, లేదా, ఆహారం సరిపోతోందా అని ముఖాముఖి మాట్లాడారు. అనంతరం నిర్ణీత రుసుం రూ.5లు చెల్లించి కలెక్టర్ కూడా స్వయంగా భోజనాన్ని ఆరగించి ఆహారం నాణ్యతను పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు. అన్న క్యాంటీన్ చుట్టూ పరిసరాలను పరిశీలించి మరింత మెరుగైన పారిశుధ్య నిర్వహణ చేయాలన్నారు. అనంతరం అక్కడికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తన అభిప్రాయాన్ని కూడా కలెక్టర్ నమోదు చేశారు. నిరుపేదలు, బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు అన్న క్యాంటీన్లను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, అన్న క్యాంటీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనకు తొలి అడుగు ఇంటింటికి మంచి ప్రభుత్వం కార్యక్రమం లో ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్

విభారే న్యూస్ ప్యాపిలి :- డోన్ నియోజకవర్గం చంద్రిపల్లి గ్రామము నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో భాగంగా ఇంటింటికి వెళ్లి మీకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయ అని తెలుసుకున్నారు . ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రాష్ట్రానికి ఏం చేశారు అనే విషయాలను, భవిష్యత్తులో ఏమేమి చేస్తారో కూడా వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరించారు సిఎం నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వం లో సంక్షేమంలో దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని, ఇందుకు ఏడాదికి 34వేల కోట్లు అవుతుందన్నారు. సూపర్ 6 హామీలలో భాగంగా 1) తల్లికి వందనం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు ఇప్పటికే నగదు జమ చేశామన్నారు. 2) దీపం-2 పథకం కింద ఏడాదికి



3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాము. 3) 16,347 ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ ప్రక్రియ తుది అంకానికి చేరింది 4)ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని5)ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు నగదు వేస్తామన్నారు. 6)రాష్ట్రవ్యాప్తంగా 204 అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి, రూ.5లకే పేదవాడి ఆకలి తీరుస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యలపై గతంలో వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎంతో , ఉప ముఖ్యమంత్రి మంత్రులు, ఎమ్మెల్యేలు ఇల్లు ఇల్లు తిరుగుతున్నారు. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో , టీడీపీ నాయకురాలు శైలజ తెలుగుదేశం పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జులు, భూత్ ఇన్చార్జులు, కూటమి నాయకులు కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వెంకటరమణాచారి గారు మాజీ సర్పంచ్ ఆదినారాయణ రామకృష్ణ పాల రామ కృష్ణ రామయ్య బోయ రామకృష్ణ బోయ దామోదర్ పుల్లయ్య సందీప్ సురేంద్ర రామ్మోహన్ శ్రీకాంత్ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# అల్లూరి పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు



విభారే. కర్నూల్. ప్రతినిధిజులై 4దేశ స్వాతంత్ర్య పోరాటంలో మన్యం వీరుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పాత్ర ఎంతో కీలకమైందని ఆయన పోరాటస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అన్నారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి బ్రిటీష్ వారిపై పోరాడారని వారిని స్మరించుకోవడం జాతి ఎప్పటికీ మరవకూడదన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ వారిపై పోరాడి ప్రాణ త్యాగం చేశారని కొనియాడారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# 50 శాతం రాయితీతో సమీకృత దాన పంపిణీ..



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 4 పాడి సంపద పెంపొందించే క్రమంలో ప్రభుత్వం 50% రాయితీతో పాడి పశువులకు సమీకృత దాణా సరఫరా చేస్తుంది ఈ క్రమంలో శుక్రవారం డోన్ పట్టణంలోని స్థానిక ప్రాంతీయ పశు వైద్యాశాల లో పాడి రైతులకు డాక్టర్ నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ వారి ఆధ్వర్యంలో దాణాను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ 50 కేజీల దాణాను సంచి పూర్తి ఖరిదు రూ.1110/- సబ్సిడీ 555/-ఫోను రైతు వాటాగా 555/-చెల్లించాల్సి ఉంటుంది. మండలానికి 100 సంచులు సరఫరా చేయడం జరిగింది.ఈ యొక్క దాణాలో 20% మాంసకృతులు ఉంటాయి, కాబట్టి పాడి పశువులకు పెట్టడం వలన పాల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. రైతులు గుర్తించుకోవాల్సిన విషయంలో ఈ దాణా పెళ్ళేట్ (గులికల) రూపంలో ఉంటుంది. కాబట్టి పశువులకు వేసేటపుడు గంట ముందు నానబెట్టి తినిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్.కే.పద్మావతి దేవి పశు వైద్య అధికారి, యు.కొతపల్లి ,డాక్టర్.ఎస్.గౌసియ బేగం పశు వైద్య అధికారి, కోచెరువు,మహమ్మద్ రఫీ ఎల్ ఎస్ ఏ, నవ్య ఏ హెచ్ ఏ మరియు రైతులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190